# ప రి హా ర ం

వాతావరణాన్ని చల్లబర్చిన సాయంత్రం నిద్రకోసం వొళ్ళు విరుచుకుంటూండగా — వసంతరావు ఆఫీసునుంచి యింటి కొచ్చాడు. మేడ మెట్లెక్కుతూ ప్రక్క పోర్షనులో ఎవరో అద్దెకు చేరినట్టు గ్రహించాడు. తన యింటి తాళం తీస్తూ ప్రక్క వాటాకేసి చూశాడు. ముందుగది తలుపులు తెరువబడి వుండగా, ద్వారానికి కట్టిన గ్రీన్ కర్టెన్ గాలికి ఉయ్యాల ఊగుతోంది.

ఆ మేడపైన అద్దెకు రెండేరెండు పోర్షన్లున్నాయి. ఒక దాంట్లో అతను సంవత్సరన్నర నుంచీ వుంటున్నాడు. రెండోది పది రోజుల క్రితమే ఖాళీ అయింది. అంతకుముందు ఆ పోర్షనులో పోస్టల్ ఇనస్పెక్టరు వుంటూ వుండేవాడు. ఆ మధ్యనే ట్రాన్స్ ఫరై ఏలూరు వెళ్ళాడు.

డ్రస్సు మార్చుకొని, లుంగీ బనీనుతో వరండా బయటి కొచ్చి పైపు దగ్గర కాళ్ళూ, చేతులూ, ముఖమూ కడు క్కుంటూ వుండగా- మెల్లగా గాజుల చప్పుడైంది. ఆ చప్పు డుకు వసంతరావు హృదయంపై చిన్న అడుగు పడింది. చివ్వు క్కున తలెత్తి చూశాడు.

మబ్బుల చాటునుంచి తొంగిచూసిన చంద్రునివలె, ఓ పరి పూర్ణ యౌవనయువతి ఓరగా చూసి, మెల్లగా లోపలకు తప్పు కుంది. ఆమెను సాంతం చూడకుండానే ఆమె సౌందర్యాన్ని అంచనాకు తీసుకున్నాడు. తర్వాత కొద్ది నిముషాలకే అతను

టర్కీ టవల్‌తో ముఖం తుడుచుకుంటూ వుండగా-అయిదు యేళ్ల కుర్రవాడు బయటికొచ్చి వసంతరావును తేరిపార జూశాడు. కుర్రవాడు రవ్వ లడ్డూలా వున్నాడు కుర్రవాడ్ని చూసే తల్లి అందచందాల్ని ఊహించవచ్చు.

వసంతరావు గదిలోకి వెళ్ళాడు. టర్కీటవల్ భుజాన వేసికొని.

సూర్యుడు సంపూర్ణంగా నిష్క్రమించగా మునిమాపు కనుబొమలు చిట్లించింది.

"బాబూ, లోపలికిరా!" అన్న పిలుపు వినవొచ్చింది. ఆమె కొడుకును పిలుస్తోంది కామోసు ననుకున్నాడు. ఆమె కంఠం ఎంత మృదువుగా, మధురంగా వుంది!

రాత్రి పదున్నర వరకూ గదిలో ఏకాంతంగా కాలక్షేపం చేసి బజారుకు బయలుదేరాడు వసంతరావు-హోటల్లో భోజనం చేసిరావడానికి. బయటకు వెడుతూ ప్రక్క పోర్షను ద్వారం కేసి దృష్టి సారించాడు. ఆమె కనబడలేదు. ద్వారానికి వేసిన కర్టెను గాలికి రెపరెపలాడుతూనే వుంది.

రెండు పోర్షన్లవారికీ క్రిందకు దిగటానికి ఒకే మెట్లమార్గం. పైన పైపుకూడా ఒకటే. బాత్‌రూంలూ, లావెటరీలూ, వంట గదులూ ప్రత్యేకం. క్రింద మేడచుట్టూ విశాలమైన ఖాళీ ప్రదేశ ముంది. ఆ ప్రదేశంలో కొబ్బరిచెట్లూ, క్రిందభాగాలలో అద్దెకున్నవారు పెట్టుకున్న కూరగాయలపాదులూ, ఒక మునగ చెట్టూ వున్నాయి. ఒక వరల బావి కూడా వుందిగానీ అది వాడికలో లేదు. క్రింద భాగంలోనే యింటి యజమాని కూడ వుంటున్నాడు. మెయిన్ బజారుకు ఆ వీధి చాలా దూరంలో వుండటంచేత ఆ పరిసరాలలో పెద్ద సందడి వుండదు. అందరూ

తమ జీవితాలలో ప్రశాంతతను ఆరాధిస్తూన్నట్టు కనబడుతుంది. ఒకళ్లజోలీ, సంగతీ, సందర్భమూ మరొకళ్లకు నిమిత్తమున్నట్టు తోచదు.

వసంతరావు బ్యాంకులో గుమాస్తా. బి. కామ్. ప్యాసై అయిదేళ్లనుంచీ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగంలో ప్రవేశించిన సంవత్సరమే వివాహం చేసుకున్నాడు. భార్య అపురూపసౌందర్యవతి, సుగుణాలరాశి. కట్నం, కానుకలు కూడా ఘనంగానే ముట్టినయ్. జీవితానికి ఏర్పడ్డ స్థిరత్వంతో, అనుకూల దాంపత్యంతో, కలిసివొస్తున్న కాలంతో సుఖశాంతులు మెండుగా లభిస్తున్నాయన్న సంతృప్తి అతనికి లేకపోలేదు. ఉద్యోగమైన దగ్గర్నుంచీ తెనాలిలోనే వుంటున్నాడు. కాకపోతే రెండు యిళ్లు మారాడు-సరియైన వసతీ, యిరుగుపొరుగు మంచీ దొరకక.

రెండు నెలల క్రితమే వసంతరావు భార్య వెంకటలక్ష్మి పుట్టింటికి వెళ్లింది కాన్పుకోసమై. తొలికాన్పు. అత్తగారు వచ్చి తీసికెళ్లింది, తొలికాన్పు విధిగా పుట్టింట్లో జరగాలని. వసంతరావు అంతగా యిష్టం లేకపోయినా అభ్యంతర పెట్టలేదు. భార్యతో ఎడబాటు నిర్భరమని మొదట్లో భావించినా నెల రోజులు గడిచేప్పటికి క్రమంగా ఏకాంత వాసానికి అలవాటు పడ్డాడు. ఇంకా భార్య ప్రసవించలేదు. వారం వారం ఉత్తరాలు వస్తూనే వున్నాయి. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూనే వున్నారు. ప్రసవించిన తోడనే మగశిశువైనా, ఆడశిశువైనా టెలిగ్రాం యిప్పించమని కోరుతూనే వున్నాడు. తొమ్మిదోమాసం వచ్చిన దగ్గర్నుంచీ ఆ టెలిగ్రాం కోసం ప్రతి రోజూ, ప్రతి గంటా, ప్రతి నిముషమూ తీక్షణంగా ఎదురు చూస్తూనే వున్నాడు వసంతరావు.

హోటలులో భోజనం చేసి తీపికిళ్లీ వేసికొని, సిగరెట్టు కాల్చు కుంటూ యింటికి వచ్చాడు వసంతరావు. రాత్రి తొమ్మిది గంటలైంది. పరిసరాలు నిద్ర కొరిగినంత నిశ్శబ్దంగా వున్నాయి. పై మెట్లు ఎక్కుతూ ప్రక్క పోర్షనులో కొత్తగా చేరిన ఆమెను పూర్తిగా చూశాడు. ఆ పోర్షను ముందుగది తాలూకు తలుపులు బార్లా తెరిచి వున్నాయి. గ్రీన్ కర్టెన్ తొలగించబడి వుంది. కుర్చీలో కూర్చుని ఆమె తీరిగ్గా వారపత్రిక చదువు కుంటోంది. వయస్సు పాతిక సంవత్సరాల లోపే, నల్లంచుల తెల్లటి వాయిల్ చీరె, అదే అంచుగల పల్చటి జాకెట్టు ధరించింది. మెడలో ఒంటిపేట గొలుసుగల లాకెట్ బరువైన రొమ్ముల క్రిందికి వ్రేళ్లాడుతోంది. చక్కని శిరోజాలంకరణ చేసికొంది. మల్లెపువ్వులు మత్తెక్కించే వాసనల్ని వెదజల్లు తున్నాయి. ఆకర్షణ ప్రధానంగాగల సౌందర్యం ఆమె ముఖంలో కొట్టవచ్చినట్టుగా కనబడుతూన్నది. ఆ సౌందర్యాన్ని పరిపూర్ణంగా వికాసం పొందిన యౌవనం ద్విగుణీకృత పరుస్తోంది. బాగావిచ్చిన ఎర్ర గులాబీలాంటి లావణ్యం మెరుగులు దిద్దుతోంది.

వసంతరావు మెట్లెక్కుతూన్న చప్పుడుకు ఆమె తలయెత్తి కళ్ళలో వెలుగును ప్రదర్శిస్తూ నిర్వికారంగా చూసింది. అతనూ ఆమెకేసి ఆసక్తిగా చూశాడు. ఇరువురి చూపులూ గాలిలో బాణాలు ఏకమైనట్టు ఏకమైనాయి. వసంతరావే ముందుగా తల దించుకున్నాడు. స్త్రీలకేసి నిటారుగా, నిస్సిగ్గుగా, నిర్మొహమోటంగా చూడడం అతనికి అలవాటులేదు. తల దించుకొనే తన పోర్షనులోకి వెళ్లాడు.

ఆమె రూపు, ఆ రూపంలోవున్న సౌందర్యం, లావణ్యం,

మనోజ్ఞత, ఆకర్షణ అతనిమనస్సులో గాఢంగా హత్తుకున్నాయి సైక్రికలర్ ప్రింటింగులాగ. మంచంమీద పడుకొని ఆమెను గురించే ఆలోచించసాగాడు. ఎన్నోసిగరెట్లు కాల్చాడు. ఇంటిలో మగవారు వున్న అలికిడేలేదు. ఒక్కతే వుంటున్నదా? భర్త ఏమైనాడు? ఒకవేళ బజారుకెళ్లాడేమో! ఇంకా రాలేదేమో! ఏదైనా ఉద్యోగం చేస్తూన్న స్త్రీయేమో! లేకపోతే భర్త మరణించాడేమో! విధవలాగాలేదే! నుదుట కుంకుమబొట్టు, సిగలో పువ్వులూ, అంచులచీరె నిండు ముత్తయిదువలాగా వున్నది. నాగరికం గిరాకీగా వున్న ఈ కాలంలో భర్తలు చని పోయిన స్త్రీలు కూడా నిఖార్సయిన ముత్తయిదువుల్లాగా కన బడు తున్నారు. ఆచారాలలోనూ, వేషభాషలలోనూ మార్పు లొస్తున్నాయి. కట్టూ, బొట్టూ చూసి స్త్రీల సాంఘికస్థాయిని అంచనా వేయటం కష్టం. ఏమైనా ఆమెను గురించీ, ఆమెకు భర్త వున్నాడా, లేదా అన్న విషయంపై తను యింతగా మన స్సులో తర్జనభర్జన పడడం అనవసరం. ఆమెకు భర్త వున్నా, లేక పోయినా, మరొకళ్ల ప్రాపకంవున్నా, ఏకాకిగా జీవిస్తున్నా తను ఆలోచించాల్సిన అగత్యమేముంది?

ఆ రోజు రాత్రి పదకొండు గంటలకుగానీ నిద్రపోలేదు వసంతరావు. ఆమెకూడా పదిన్నర గంటలవరకూ నిద్ర పోయి నట్టులేదు. కొత్తగా యింటిలోకి ప్రవేశించింది గనుక ఏవో సామానులు సర్దుతూనే ఉన్నది. పిల్లవాడు మేల్కొన్న అలి కిడి లేదు. త్వరగా నిద్రబోయినట్టున్నాడు. ఆ రాత్రి ఆమె భర్త వచ్చినట్టులేదు.

మరునాడు ఆరున్నర గంటలకు నిద్రలేచాడు వసంత రావు. బయట వరండాలో ముఖం కడుక్కుంటూ ఆమెను

చూశాడు. ఆమె పైపుదగ్గర 'విమ్'తో స్టీలు పళ్లాలు తోము తోంది. ఆమెకేసి సూటిగా చూడలేక పిట్టగోడ ప్రక్కన నిల బడి, బ్రష్‌తో పళ్లు తోముకుంటూ మేడక్రింద పెరటిలోకి చూడ సాగాడు. ఆమె రెండు మూడు సార్లు సూటిగానే అతనికేసి చూసి, త్వరగా పళ్ళాలు కడుక్కొని యింటిలోకి వెళ్లింది. ఆమె ఇంటిలోకి వెళుతూండగా ధైర్యంచేసి కళ్లు అప్పగించాడు. ఆమె గుండ్రటి భుజాలమధ్య వెడల్పయిన వీపూ, సన్నని నడుమూ, జఘన సౌందర్యమూ, నల్లత్రాచు పడిగలాంటి జడా వసంతరావు హృదయం నీటి అలలమీద దిగజారే వెన్నెలవలె నైయింది. 'బ్రహ్మాండమైన పర్సనాలిటీ!' అనుకున్నాడు.

అతను శుచిగా స్నానం చేసి, పౌడరు స్నోలతో ముఖాన్ని మృదువుపర్చి—కాఫీ కోసం బజారుకు వెళ్లబోతూండగా ఆమె కూడా పిల్లవాడ్ని వెంట బెట్టుకొని చేతిలో పుస్తకాలతో బయలుదేరింది. చాల దగ్గరగా చూశాడామెను. స్లేట్ కలర్ వెంకటగిరి నేతచీరె, జాకెట్టు ధరించింది. మెడలో ముత్యాల నెక్లెస్ వేసికొంది. అందంగా మల్లెపూలు తట్టంత తలచుట్ట చుట్టు కుంది. స్నో పౌడర్లతో ముఖం కళ కొట్టవస్తోంది.

పంతులమ్మ కామోసు! బడికి వెళ్తుతోంది అనుకున్నాడు.

అతనే ముందుగా మేడమెట్లు దిగాడు. తర్వాత ఆమె దిగింది. ఆమె వెంటనే పిల్లవాడుకూడా. వసంతరావు కాఫీ హోటలుకు నడిచే వెళ్ళాడు. ఆమె రిక్షాలో ఎక్కింది.

ఆమెను గురించి ఆలోచన వసంతరావు మనస్సులో మక రందంచుట్టూ తేనెటీగలు ప్రదక్షిణం చేస్తూన్నట్టు చేయసాగాయి. పది గంటలకు బ్యాంకు కెళ్ళాడు. కొత్త ఉత్సాహం. నిర్వ చనకు అందని సంతోషం, తెలీని ఆదుర్దా అతనిని అదోరకమైన

మానసిక స్థితిలో పడవేశాయి. ఒకప్రక్కన ఆఫీసు పనులు చేస్తూనే ఆలోచనల్ని ఆకాశపు నిచ్చెన మెట్లు ఎక్కిస్తూ కులాసాగా వున్నాడు.

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి నేరుగా యింటికి వచ్చాడు వసంతరావు ఎక్కడా రవ్వంతసేపు ఆలస్యం చేయకుండా. భార్య యింటిదగ్గర వున్నప్పుడు కూడా అంత పెందలకడ యింటికి వచ్చేవాడు కాదు. ఆమెను పదేపదే చూడాలనే వెచ్చని ఉత్కంఠా, పరిచయం చేసికొని ఆమె చరిత్ర తెల్సికోవాలనే తహతహా అతనిలో పురకలు పెడుతున్నాయి.

అతను యింటికి వొచ్చేసరికి ఆమె యింట్లోవున్న అలికిడి వినవచ్చింది. 'అప్పుడే వచ్చేసిందే స్కూలునుంచి' అనుకున్నాడు. మగపురుగు మాటేమైనా వినవస్తుందేమోనని కొంచెం సేపు నిశ్శబ్దంగా చెవులు రిక్కించాడు. వంటగదిలో స్టీలు సామాను కదిలిస్తోన్న చప్పుడూ, ముందుగదిలో కుర్రవాడు సినిమాపాటలు పాడుతూన్న సవ్వడీతప్ప మరో మగగొంతుక వినరాలేదు. 'ఆమెకు మగదిక్కు లేదు. ఒక్కతే బ్రతుకుతూంది ఉద్యోగం చేస్తూన్నది. నాగరికత, ప్యాషనులు మెండైన స్త్రీ. నీతీ, సాంఘిక, విలువలపట్ల పెద్ద లక్ష్యం వున్నట్టులేదు' అనుకున్నాడు వసంతరావు.

సాయంత్రం ప్రశాంతంగా వుంది.

వాకిటిముందుకు పడకకుర్చీ లాక్కొని, పేపరు చదువుతో కూర్చున్నాడు. సిగిరెట్టు కూడా వెలిగించాడు.

ఆ కుర్రవాడు హఠాత్తుగా అతని గదిలోకి వచ్చాడు. పొట్టి కాకీలాగూ, తెల్లచొక్కా వేసికున్నాడు. పాలు గారుతూన్నట్టుంది వాడి ముఖం. ఎంతో ముచ్చటగా వున్నాడు. 'ఏం

కావాలి?' అన్నట్టు తలెత్తి చూశాడు వసంతరావు.

"మా అమ్మ అగ్గిపెట్టెవుంటే యిప్పించుకు రమ్మన్నది" అన్నాడా కుర్రవాడు బెదురుచూపులు చూస్తూ.

వెంటనే ప్రక్క జేబులోంచి తీసి ఇచ్చాడు వసంతరావు అగ్గిపెట్టె. రెండు గంతులలో లోపలికి వెళ్ళాడు ఆ కుర్రవాడు. సంతృప్తిగా చిరునవ్వు నవ్వుకున్నాడు వసంతరావు. అట్లాంటి అవకాశాలకోసం అతను కాచుకూర్చున్నాడు.

వెన్నెలరాకతో మునిమాపు పల్చబడింది. ప్రాణానికి హాయిని కలిగించే చల్లనిగాలి పచార్లు చేస్తూంది. వసంతరావు యింకా బజారుకు వెళ్ళలేదు భోజనానికి. వరండాముందు ఖాళీ ప్రదేశంలోకి వచ్చాడు. వెన్నెల వెలుగుకూ, గాలి చల్లదనానికీ, వాతావరణపు కులాసాకీ ఆమె ఉల్లాసంగా బయట తిరుగుతోంది. ఆమెను కిటికీలోంచి చూసే వసంతరావు బయటికొచ్చాడు. ఆమెను పల్కరించి పరిచయం చేసికోవాలన్న లాలస మనస్సులో పొళ్ళిగింతలు పెడుతోంది.

ఇవతలతట్టు పిట్టగోడ చెంత అతనూ, అవతలతట్టు పిట్టగోడ దగ్గర ఆమె కొంచెంసేపు నిలబడ్డారు. ఇరువురూ ప్రయత్నపూర్వకంగా ఒకళ్ళ నొకళ్లు చూసుకున్నారు. ఇరువురూ మనస్సులతో మాట్లాడుకుంటున్నారు. చూపులతో వొళ్ళు తడుముకుంటున్నారు. పొడి ఆరని కోర్కెలతో ఆవేశపడుతున్నారు. ముందుగా ధైర్యం చేసి, గాలిలో నోరు విప్పాడు వసంతరావు.

"కొత్తగా చేరారా గదిలో"

"అవునండీ!" అన్నదామె పరిచయం కోసం తహతహను కనబరుస్తూ.

"తమ పేరు..."

"వనజాక్షి అండీ! ఎలిమెంటెరీ స్కూలులో పని చేస్తున్నాను."

"నా పేరు వసంతరావు. బ్యాంకులో పని చేస్తున్నాను. ఒక్కరే ఈ గదిలో ఉంటూన్నట్టుంది

ముడి విప్పితే జారిన పట్టుతెరలా నిశ్శబ్దంగా నవ్వింది వనజాక్షి.

"అవునండీ! మా వారికీ హైద్రాబాద్‌లో ఉద్యోగం. వారక్కడే వుంటారు. నాకు యిక్కడ ఉద్యోగం. మా అబ్బాయీ, నేనూ ఇక్కడే వుంటాము. సెలవులకు హైద్రాబాద్ వెళ్ళివస్తూ వుంటాము. మీరూ ఒక్కరే గదిలో వుంటూన్నట్టుంది"

"తాత్కాలికంగా ఒక్కణ్ణే వుంటున్నాను. మా ఆవిడ కాన్పుకు పుట్టింటికెళ్ళింది. ఇంకా అయిదారు మాసాలకుగానీ రాదు. అంతవరకూ ఏకాంతవాసమే" అన్నాడు వసంతరావు ఆ చివరిమాటను నొక్కి పలుకుతూ.

అతని బాధను గ్రహించినంత సులభంగా నవ్వింది వనజాక్షి. కాని ఆమె నవ్వులోని నిక్షిప్త పర్చబడ్డ భావాన్ని అతను సులభంగా గ్రహించలేక పోయాడు.

ఆ రాత్రి ఆ విధంగా ప్రారంభమైన వాళ్ళ పరిచయం దిన దినాభివృద్ధి గాంచినది. మాట్లాడుకొనే అవకాశాల్ని, చూపుల్ని కలుపుకొనే తరుణాల్ని, చిరునవ్వుల్ని దొర్లించుకొనే సమయాలనూ పెంచుకున్నారు. ఒకరోజు పది రూపాయల చేబదులు కోసం కొడుకును అతని దగ్గరకు పంపింది. సంతోషంగా ఇచ్చి పంపాడు. ఆ సాయంత్రమే ఆమెతో నిర్మొహమాటంగా అన్నాడు:

"ఎంతటి వాళ్ళకైనా డబ్బుతో ఇబ్బంది కలుగవచ్చు. మీకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు నాకు కబురు చేయండి. సర్దుతాను.

మీరు బాకీగా భావించి ఆదుర్దా పడక్కర్లేదు. మీ దగ్గిర పుష్కలంగా వున్నప్పుడే తిరిగి ఇవ్వొచ్చు" నవ్వులో నీడల్ని దొర్లించి, నిశ్శబ్దంగా వూరుకుంది. రెండు రోజుల తర్వాత ఆ పది రూపాయల్ని పిల్లవాడి చేత పంపించింది వనజాక్షి. అంత త్వరగా ఆ డబ్బును ఆమె పంపినందుకు రవ్వంత నొచ్చుకున్నాడు వసంత రావు. మళ్ళీ ఆమె ఎప్పుడు చేబదులు కోసం పంపుతుందో ఎదురు చూడ సాగాడు.

మూడోరోజు రాత్రి తొమ్మిది గంటలకు వనజాక్షి అతని గదికి వొచ్చింది. ఆనందాతి రేకంతో ఉక్కిరి బిక్కిరైనాడు వసంతరావు. కుర్చీ చూపించి కూర్చోమన్నాడు. ఎందుకో వొళ్ళంతా అదోలా అయింది. "నిద్ర రావడం లేదు ఎంత ప్రయత్నించినా. ఏవైనా పుస్తకాలుంటే ఇవ్వండి చదువుకోవడానికి" అన్నది వనజాక్షి వొళ్లు విరుపులో నిద్రపట్టని స్థితిని తెలియబరుస్తూ.

"ఓ అలాగే" అన్నాడు వసంతరావు. కాని వాస్తవానికి అతనిదగ్గర ఆట్టే పుస్తకాలు లేవు. అతనికి సాహిత్యం మీద అభిలాష ఏమీ లేదు. నవలలూ, కథలూ చదివే అలవాటు లేదు. న్యూస్ పేపరు మటుకు రోజూ చదువుతాడు. రెండు అల్మరాలు వెతికి ఓ పాత డిటెక్టివ్ నవల యిచ్చాడు. ఆ నవలమీద ఆమెకు మోజు లేకపోయినా, కాలక్షేపం కోసం తీసుకుంది.

మరునాడు సాయంత్రం ఆఫీసునుండి ఇంటికి వస్తూ, పుస్తకాల షాపు కెళ్ళి వో అరడజను నవలలూ, రెండు కథల పత్రికలూ, రెండు సినిమా మ్యాగజైన్‌లూ కొనుక్కొచ్చాడు వసంతరావు. ఈ రోజులలో స్త్రీలలో పుస్తక పఠనాసక్తి విపరీతంగా పెరిగింది. కొంతమంది ఆడవాళ్లు, నవలలమీదా, పత్రికలపైనా

చూపే అభిలాషా, ఆసక్తీ, ఆదుర్దా కట్టుకున్న భర్తలపై కూడా చూపెట్టటంలేదు. గృహకృత్యాల్ని తాత్కాలికంగా అవతల నెట్టి పుస్తకాలకోసం ప్రాకులాడుతున్నారు. ఇదివరలో ఏ పంచదారకోసమో, ఏ కాఫీపొడి కోసమో, ఏ కరివేపాకు కోసమో ప్రక్కింటి కెళ్ళితే—ఇప్పుడు ఏ నవలకోసమో, ఏ కథల పుస్తకం కోసమో, ఏ వారపత్రిక కోసమో ప్రక్కిళ్ళకు వెళుతున్నారు. వయస్సులో వున్న స్త్రీలకు పుస్తకాలూ, మ్యాగజీన్లూ పంపటం ద్వారా పరిచయాన్ని గట్టిపర్చుకొని, కోర్కెల్ని తీర్చుకున్న ఇద్దరు ముగ్గురు వ్యక్తులు వసంతరావు దృష్టిపథంలో నిలిచారు. ఆ విధంగానే వనజాక్షితో పరిచయాన్ని దృఢతరం చేసికొని, ప్రేమ కలాపాన్ని కొనసాగించ వచ్చునని విశ్వసించాడు. ఆ సాయంత్రం ఇంటికి రాగానే ఆ పుస్తకాల్ని, పత్రికలనూ ఆమె దగ్గరకు పంపాడు.

ఒక ఆదివారం మధ్యాహ్నం వసంతరావు గదిలోవుండగా వనజాక్షి పిల్లవాడి చేత రెండు లడ్లూ, ఒక ప్లేటు పకోడీలూ పంపింది. తర్వాత టీ కూడా పంపించింది. ఆ ఫలహారంతిని, టీ త్రాగాడు వసంతరావు. తమ పరిచయం గట్టిపడి, తన కోర్కెలు గుర్రాలెక్కే శుభసమయం ఆసన్నమౌతున్నదని సంతోష పడ్డాడు.

కాని మరుక్షణంలోనే ఓ రకమైన మానసికాందోళన ఆరంభమైంది. తను చేస్తూన్న పనేమిటి? ఎంత అన్యాయం? ఎంత అవినీతి! భార్యకు ఎంత ద్రోహం? తను చదువుకున్నవాడూ, ఉద్యోగస్తుడూ, సభ్య సమాజంలో పరువు ప్రతిష్ఠలు గలవాడూ, నైతికంగా ఏ అపఖ్యాతీ లేనివాడూ—అట్లాంటి అవినీతి బురదలో దిగేందుకు తాపత్రయ పడటమేమిటి? యెంత నీచం? ఆమె

సౌందర్యానికి తను ముగ్ధుడు కావచ్చు. ఆమె లావణ్యం తనలో కోర్కెల్ని కదలించవచ్చు; అవకాశాలు ఆ కోర్కెల సఫలతకు పచ్చదీవాన్ని చూపెట్టవచ్చు. కాని తను క్షణికోద్రేకాల పెనుగాలికి సర్వీ మొక్కలా వొంగిపోవడం ఏం సబబు? ఆత్మ నిగ్రహం. భార్యపై గల నిష్కల్మష ప్రేమ, గాఢానురాగము, వ్యక్తిత్వపు పటుత్వమూ, సభ్యతా సంస్కారాల గట్టిదనమూ తనలో ఏమైనట్టు? తనని దైవంగా నమ్ముకొని, పవిత్రంగా ఆరాధిస్తూన్న భార్యకు ద్రోహం చేయడమా? ఈ విషయం తెలిస్తే ఆత్మహత్య చేసికోదూ! ఎట్లా తెలుస్తుంది? తెలీనివ్వకుండా తను జాగ్రత్త పడలేదూ! లోకంలో ఎంతమంది భర్తలు తాము చేసే అవినీతి కార్యాలనూ, అకృత్యాలనూ, అన్యాయాలనూ తమ భార్యలకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడటంలేదూ! అట్లాగే తనూ!...ఏమైనా వనజాక్షితో అనుభవాల్ని పదిలపర్చుకోని బ్రతుకు నిస్సారం, ఆనందరహితం. మూగ ఎండలాంటిది. నీతీ, ధర్మమూ, న్యాయమూ, పరువు, ప్రతిష్ఠలూ-చూసుకుంటే కోర్కెల్ని నాలుగు గోడలమధ్య ఖైదుచేస్తే ఏ వ్యక్తి స్వేచ్ఛా సుఖాన్ని పొందలేడు.

ఆరోజు సాయంకాలం అతను ఆఫీసునుంచి ఇంటికి వచ్చీ రావడంతోనే పెద్దపెట్టున వర్షం ప్రారంభమైంది. కొంచెం సేపటికి ఆ వర్షపు జోరు తగ్గి ముసురులోకి దిగింది. చీకటి పడింది. సన్నగా వర్షం కురుస్తూనేవుంది. వసంతరావు పడక కుర్చీలో కూర్చుని వాన ప్రకృతిని తిలకిస్తున్నాడు. ఎట్లా ఈ వర్షంలో భోజనానికి హోటలుకు వెళ్ళడం? గొడుగైనాలేదు. అనుకున్నాడు. సిగరెట్టు వెలిగించాడు.

అతని గదిలోకి వనజాక్షి వొచ్చింది. అతను ఊహించలేదు.

ఆమె చాల సామాన్యంగానే వొచ్చింది.

"ఇవాళ మీరు మా యింట్లో భోంచేయండి. ఈ వర్షంలో మీరెట్లా హోటలుకు వెళతారు?"

ఆమె ఆహ్వానానికి మనస్సులో మురిసిపోయాడు వసంతరావు. కాని పైకి మొఖమోటాన్ని కనబర్చాడు.

"అబ్బె, ఎందుకులెండి! హోటలుకు వెళ్ళి భోంచేసి వస్తాను. ఈ వాన మనుసురేం జేస్తుంది?"

"ఏం మా యింటిలో భోంచేయకూడదా?" సరాగం ప్రతి ధ్వనించేట్టు ప్రశ్నించింది వనజాక్షి.

ఇబ్బందిలో పడ్డాడు వసంతరావు. మనస్సులో సంఘర్షణ, ముఖంలో అలజడి, ఎదురుచూస్తూన్న మంచి సమయం రానే వచ్చింది. తను ఉపయోగించుకోవటంలోనే వుంది రసనిష్పత్తి, అవకాశం చేతులు చాస్తోంది. ఆమె అంతట ఆమే స్వయంగా స్వాగతమిస్తోంది. తనకి జంకెందుకు?...కాని తను జీవితంలో గొప్ప సాహసం చేస్తున్నాడేమో! ఈ పరిచయమూ, చొరవా, కోర్కెలూ ఒకళ్ళకొకళ్ళు దగ్గర కావటమూ, లేనిపోని బంధ నాలు పెంచుకోవడమూ — ఎట్లాంటి పరిణామాలకు దారి తీస్తాయో! తను తొందర పడుతున్నాడేమో! తనలో వివేచనా శక్తి క్షీణిస్తున్నదేమో! ఎండమావుల్లాంటి సుఖాలకోసం శాశ్వ తంగా పతనం చెందుచున్నాడేమో!

"మా ఇంటిలో భోజనం చేయడం మీ కంతగా ఇష్టం లేక పోతే, బలవంతమేమీ లేదులెండి" అన్నది వనజాక్షి చిరుకోపాన్ని నటిస్తూ.

నీటిలో జారిపడ్డ ఉప్పుగడ్డ యైనాడు వసంతరావు. ఆత్మలో ఆత్మవంచనతో ఆవురావురు మంటూనే కాలాన్ని వృథా

పుచ్చడం జరుగుతూ వుంటుంది. తను ఆ తరహాకు చెందిన వ్యక్తి కాదు. అనుకుంటున్నాడు వసంతరావు.

సంఘర్షణ హఠాత్తుగా ఆగిపోయింది. ఆత్మ నిగ్రహాపు వాతావరణంలో మార్పు వొచ్చింది. లోపలి సంతోషం పెదాల మీదకు దొర్లి అంగీకారాన్ని వెలువరించింది.

"వస్తానులెండి"

చెట్టునవున్న పువ్వు గాలికి స్వేచ్ఛగా నవ్వినట్టు నవ్వింది వనజాక్షి.

"వంట కాగానే కబురు చేస్తాను. ఎక్కడికీ వెళ్ళకండి" అంటూ తన ఇంటిలోకి వెళ్ళింది.

వర్షం పడుతూనే వుంది.

ఆమె కమ్మని పిలుపుకోసం ఎదురు చూస్తూ, కులాసాగా సిగరెట్లు కాలుస్తున్నాడు వసంతరావు. కొంచెం సేపు మ్యాగజీనులు తిరగవేశాడు. మరికొంతసేపు గదిలో పచార్లు చేశాడు కాలహరణం అతి కష్టమైంది.

సరిగ్గా తొమ్మిది గంటలకు భోజనానికి పిలుపు వచ్చింది. తన గది తలుపులు వేసి, గబుక్కున ఆమె పోర్షనులో జొరబడ్డాడు వసంతరావు. చిరునవ్వుల హారాన్ని ఎత్తిపట్టుకొని ఆహ్వానించింది ఆమె.

వనజాక్షిని చూడగానే వసంతరావు నిలువెల్లా పులకరించాడు. తీరని కోరిక తెరచాప ఎత్తింది. పెదాలు అప్రయత్నంగా తడి చేసికున్నాడు. వాన గాలితో కూడుకున్న వాతావరణం విలక్షణమైన అనుభూతికి దారితీసింది. ఆమె సౌందర్యంలోని ఆకర్షణ, లావణ్యంలోని మనోజ్ఞత, చూపులలోని మోహా తీవ్రత, వొయ్యారపు వొళ్ళు విరుపులలోని కవ్వింపు, అవకాశాల

ఆసరా—అతనిలో కాలాన్ని జోకొట్టే మధురమైన అనుభవాల కోసం ఉత్కంఠను హెచ్చు చేశాయి.

టేబుల్ పైన భోజనం వడ్డించింది, ఇద్దరూ ఒకేసారి కూర్చున్నారు. ఎదురుబళ్ళు, మంచి భోజనం, ముద్దపప్పూ, వంకాయ, బెండకాయ వేపుడూ, కోడిగ్రుడ్డు ఇగురూ, రొయ్యచారూ, గడ్డ పెరుగూ—సంతృప్తిగా భోంచేశాడు. అన్నింటికంటె ప్రత్యేకం ఆమె సౌందర్య ప్రకర్షను చూపులతో ఆస్వాదిస్తూ భోజనం చేయడం. కావాల్సిన పదార్థాలు వడ్డించుకుంటూ, చమత్కారాలు, ఛెణుకులు కూడిన కబుర్లతో—పది గంటలవరకూ తాపీగా భోజనం చేశారు. మిఠాయి కిళ్ళీ ఇచ్చిందామె. ఆ కిళ్ళీ నములుతూ సిగరెట్టు వెలిగించాడు వసంతరావు కుర్చీలో కూర్చుని.

దురదృష్టవంతుని బ్రతుకులోని చీకటి పగిది వర్షం సన్నగా పడుతూనే వుంది.

మనస్సుకు మత్తు కలిగించే గాలి మస్తుగా వీస్తోంది.

వనజాక్షి అతనికి ఎదురూగ్గా కుర్చీలో కూర్చుంది. పింక్ కలర్ స్లీవ్‌లెస్ టెర్లిన్ బ్లౌజుమీద వైట్‌బ్లూ నైలాన్ శారీ ధరించింది. బాడీస్ బిగుతులోంచి వక్షుద్వయపు పొంకం స్పష్టంగా ప్రకటిత మవుతూ, అతన్ని కోర్కెల వొత్తిడిలో సతమతం జేస్తూన్నది.

గదిలో నిశ్శబ్దంగా వెలుగుతూన్న విద్యుద్దీపపు కాంతిలో ఆమెకేసి కొన్ని నిముషాలపాటు రెప్ప లార్పకుండా చూశాడు వసంతరావు. తనగదికి వెళ్ళాలనిలేదు. మోహావేశంతో నరాలు ఉధృతంగా కదలాడుతున్నాయి. అనిర్వచనీయమైన సౌఖ్యానుభూతికోసం మనస్సు పరుగులు దీస్తోంది. బలమైన కోర్కె

తాలూకు నీడ మనస్సులోంచి బయటికొచ్చి ముఖంపై నాట్యం చేయగా మందహాసం చేశాడు.

"ఇంక మా ఇంటికి వెళతాను. ప్రొద్దుపోయింది" అన్నాడు వసంతరావు, పరిస్థితుల గాలిపాటును గ్రహించేందుకు.

కనురెప్ప కొసల్ని సొగసుగా కదిలిస్తూ—

"అప్పుడే ఏం తొందర? ఏం మా ఇంటిలో బావుండలేదా?" అన్నది వనజాక్షి.

ఆ మాటల వెనుక దాగివున్న భావాలు మసక చీకటిలోకి వెలుతురు పడ్డంత తేటతెల్లమైనాయి. కోర్కెల తీవ్రత పతాక స్థాయిని చేరుకోగా—గబుక్కున కుర్చీలోంచి లేచి, ఆమె కుర్చీ వెనక్కు వెళ్ళి, ఆమె గుండ్రటి బుజాలపై చేతులు వేశాడు వసంతరావు. ఆ రెండు చేతుల్ని వనజాక్షి రొమ్ములపైకి లాక్కొని మృదువుగా స్పృశించింది.

"మీ ఇంటిలో బావుంటుందనేగా ఆశపడి వొచ్చింది" అంటూ వసంతరావు మోహముగ్ధ హృదయుడై ఆమె నడుంచుట్టూ చేతులువేసి కుర్చీలోంచి లేవనెత్తి పడక గదిలోకి తీసికెళ్ళాడు.

ఆ వానపడుతూన్న రాత్రి వసంతరావు ఆమె ఇంటిలోనే ఆమె బెడ్ మీదనే ఆమె వెచ్చని కౌగిలిలో—మధురాతిమధుర మైన అనుభవాల్ని ప్రోగు జేసికొంటూ సుఖంగా నిద్ర బోయాడు. ఆరాత్రి ఎప్పుడు తెల్లవారిందో తెలియలేదు.

*　　　*　　　*

మరునాడు వసంతరావు చాల ఉత్సాహంగా ఉన్నాడు. రాత్రి అనుభవాలు ఇంకా అతని మనోవీధిలో మెర్క్యురీ దీపాల్లా వెలుగుతూనే ఉన్నాయి.

అతడు ఆఫీసుకు వెళ్ళబోయే ముందు మామగారి దగ్గర్నుంచి

టెలిగ్రామ్ వొచ్చింది. 'వెంకటలక్ష్మి ప్రసవించింది. మగ శిశువు. తల్లీ, పిల్లవాడూ కులాసా.' వసంతరావు ఆనందోద్రిక్త హృదయుడై గంతులు వేశాడు. కోరుకున్న ఫలాన్ని భగవంతుడు ప్రసాదించాడు. తను ఓ మగపిల్లవానికి తండ్రి. ఎవరి పోలికో పిల్లవాడు! ముక్కూ, ముఖమూ తన పోలికలు వొచ్చి—కళ్ళూ, రంగూ తల్లివి ఐతే బావుంటుంది. పోలికల్ని కూడా టెలిగ్రామ్‌లో వివరిస్తే పోయేది! అయినా రేపు ఉత్తరం రావొచ్చు. లేకపోతే తనే స్వయంగా రెండు రోజులు సెలవు పెట్టి వెళ్లి చూసి వస్తే—ఆ విధంగా ఆలోచించుకుంటూ ఉషారుగా బ్యాంకుకు వెళ్ళాడు. తనకి పుత్రోదయం అన్న శుభవార్తను సాటి గుమాస్తా లందరికీ చెప్పి, అభినందల్ని పొంది వాళ్లందరికీ మధ్యాహ్నం విశ్రాంతి వేళలో టీపార్టీ యిచ్చాడు వసంతరావు.

ఆ సాయంకాలం బ్యాంకు నుంచి అతను ఇంటికి వస్తుండగా మబ్బులు పట్టాయి. వర్షం వచ్చే సూచనలు గోచరించాయి. ఆ వాతావరణానికి రాత్రి వనజాక్షితో గడిపిన మధుర క్షణాలు మనస్సులో మెదిలి అశాంతిని రేకెత్తించాయి. ఛీ, ఛీ, రాత్రి తనెంత సాహసం చేశాడు? ఎంత అవినీతికి పాల్పడ్డాడు? భార్యకు ఎంత ద్రోహం? అంతగా పశు కామ ప్రవృత్తికి ఎందుకు గురైనాడు? తన వ్యక్తిత్వమూ విచక్షణాజ్ఞానం, నైతికభీతి, నిగ్రహశక్తి ఏమైనాయి? అడుసు త్రొక్కే నీచమనస్తత్వానికి ఎట్లా దిగజారాడు?

మేడ మెట్లెక్కి, గది తాళం తీస్తుండగా వనజాక్షి చిరునగవు సొగసుల్ని విరజిమ్ముతూ అతని దగ్గర కొచ్చింది.

మనస్సు సంతోష సముద్రంగా వున్నప్పటికీ, ఆ పొంగును

వసంతరావు ముఖంలో స్పష్టంగా ప్రకటించ లేక పోయాడు. యాభై ఆరో పడిలో పదమూడో పుత్రుడు పుట్టినట్టు ముఖం చిట్లించి, పెదాలు చప్పరించి "అబ్బాయి పుట్టాడు. టెలిగ్రామ్ వొచ్చింది" అన్నాడు వసంతరావు నిరుత్సాహాన్ని కనబరుస్తూ.

కనుబొమల్ని నిటారుగా కదిలించి, "వెరీగుడ్! ఓ చిన్న పార్టీ యివ్వాలి" అన్నది వనజాక్షి.

నవ్వలేక నవ్వాడు వసంతరావు నీరసంగా.

ఆ రాత్రి కూడా వనజాక్షి తన ఇంట్లోకి రమ్మనమని వసంత రావును ఆహ్వానించింది. కాని అతను చొప్ప కట్టెలా చప్ప బడి, తల నొప్పిగా వుందని తప్పించుకున్నాడు.

మూడో రోజు రాత్రి వనజాక్షే అతని గది కొచ్చింది. నిండుగా చొరవ తీసుకుని, నిర్మోహమాటంగా నిరాకరించ లేక పోయాడు. అట్లాగే రోజూ వాళ్ళ ప్రణయ కలాపాలు నిరా టంకంగా జరిగిపోతున్నాయి.

రెండు రోజులు సెలవు పెట్టి వసంతరావు మామగారి వూరు వెళ్ళి వచ్చాడు. పిల్లవాడు అచ్చు తండ్రి పోలికే. అతను విపరీతంగా సంతోషపడ్డాడు. వెంకటలక్ష్మి ఆరోగ్యం బాగానే ఉంది. ఆమె భర్తను సున్నితంగా హెచ్చరించింది. "మీరు ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోనండి. సినిమాల కెళ్ళి. చీట్లాట ఆడి రాత్రుళ్లు ఎక్కువసేపు మేలుకోనకండి. అబ్బాయికి అయిదో నెల రాగానే నేను వస్తాను అసలు మూడో నెల జొరబడగానే వద్దామనుకుంటున్నాను గానీ, అమ్మా నాన్నా ఒప్పుకోనేట్టులేదు. ఇక్కడున్నా నా మనస్సెప్పుడూ మీమీదనే ఉంటుంది. మిమ్మల్ని గురించే ఆలోచిస్తూ వుంటుంది"

భార్య అమాయకత్వానికి, నిర్మల ప్రేమకూ, అత్యంత అభి

మానానికి వసంతరావు సిగ్గు పడ్డాడు; ఆత్మ న్యూనతా భీతితో క్రుంగిపోయాడు. భార్య ముఖంలోకి సూటిగా చూడలేక తల దించుకొని వొచ్చాడు.

తాము చేసే అక్రమాల్ని, నడిచే అవినీతి దృక్పథాల్ని ఇతరెవ్వరూ గమనించుట లేదన్న ధీమా చాలమందికి వుంటుంది. వనజాక్షి విష వలయంలో దీపం చుట్టూ పురుగువలె కొట్టు మిట్టుకు లాడుతూన్న వసంతరావు కూడా ఆ ధీమా తోనే వుండటంలో ఆశ్చర్యం లేదు. అతని మానసికావస్థ క్షేమంగా లేకపోయి నప్పటికీ పైకి ఏ పాపమూ ఎరుగని పవిత్రమూర్తి వలె గంభీరంగా తిరుగుతున్నాడు. ఒక రోజు సాయంత్రం అతను బోసు రోడ్డు మీదుగా వెళుతూండగా, ప్రసాద్ ప్రెస్ వర్క్స్ దగ్గర నిలబడ్డ ఇద్దరు మిత్రులు నిలవేశారు.

"ఏమిటోయ్ వసంతరావు, మహా వడిగా వెళుతున్నావు. అప్పుడే వనజాక్షి స్కూలు నుంచి ఇంటికి వచ్చి ఉండదులే" అన్నాడొక మిత్రుడు హేళన ధ్వనించే నవ్వుతో.

రెండో మిత్రుడు బండారం బట్ట బయలైనట్టు విరగబడి నవ్వాడు.

వసంతరావు ముఖం మాడు చెక్కలా మారింది.

"పోయి పోయి ఆ వన్నెలాడి వలలో పడ్డావేమిటోయ్! అది ఒక పెద్ద ఊబి. అందులో దిగజారితే మళ్ళీ బయటపడా లంటే - నిన్ను పుట్టించిన బ్రహ్మ తరమే కావాలి! ఊళ్ళో నీమీద దుమారం గట్టిగా లేచింది. పరువు ప్రతిష్ఠలు గలిగి, చీకూ చింతా లేకుండా ఉద్యోగం చేసుకుంటూన్న నీలాంటి వాడు అట్లా కాలు జారవల్సింది కాదు. నీ తప్పేముందిలే! మానవ బలహీనత. ఆమె ఆకర్షణ ప్రభావానికి నీ హృదయం అపస్వరం

పలికింది. ఇంకా జీవితంలో అపస్వరాన్ని పలికించ కుండా—ఇప్పటికైనా కళ్లు తెరిచి మలినమైన గతాన్ని గుర్తుకు తెచ్చుకొని భవిష్యత్తులో జాగ్రత్తగా వుండు. నీ క్షేమాన్ని కోరే వాడిని, ఇంతకంటె సూటిగా చెప్పలేను" అన్నాడా మిత్రుడు.

"వనజాక్షి మన స్తత్వం నీకు తెలీదు. తన సౌందర్యాకర్షణ చేత మగవాళ్ళను వశపర్చుకొని, అరచేతిలో ఉసిరికాయ వలె ఆడించటం ఆమెకు సరదా. ఆమెకు భర్త లేడు. ఉన్నాడూ, హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడూ – అని చెబుతుంది. అదంతా బూటకం. సంఘంలో తన స్థానాన్ని కాపాడుకోనేందుకు అట్లా నాటక మాడుతూ ఉంటుంది. ఈ బస్తీలో ఆమె దాదాపు పది ఇళ్ళు మార్చింది. ఎక్కడ మొఖం మొత్తితే అక్కడ మకాం మారుస్తుంది. నీతి నియమాల ప్రమేయం లేని బ్రతు కామెది. పురుషజాతిలో నైతిక పతనాన్ని పెంపొందించడమే ఆమె జీవిత ధ్యేయం. ఆమె అవినీతి దుర్గంధంలో పొర్లాడి శాశ్వతంగా జీవితపు విలువల్ని గోల్పోయిన అభాగ్యులు పది పన్నెండు మంది వరకూ ఉన్నారు ఈ టవున్లో - ఇప్పటికైనా మించింది లేదు. త్వరగా సంకెళ్ళను సడలించుకొని బయటపడు" అన్నాడు రెండో మిత్రుడు.

అగ్నిజ్వాలకు పచ్చని చెట్టు కమిలిపోయినట్టుగా వసంతరావు ముఖం మారింది. కడుపులో ఏదో వికారం బొంగరంలా తిరుగనారంభించింది. క్షణం సేపు స్నేహితుల ఎదుట నిలబడలేక పోయాడు. గబగబా ముందుకు నడిచి, ఇంటి కెళ్ళాడు. ఆత్మలో సంఘర్షణ తీవ్రమైంది. ఎంత అజ్ఞానంగా, అవివేకంగా ప్రవర్తించాడు? తన అవినీతి బజారు పాలైంది. తన పరువు ప్రతిష్ఠలు దెబ్బ తిన్నాయి. తన జీవితపు మలుపు గతుకుల దారి

పట్టింది. ప్రతి వ్యక్తి జీవితంలో కొన్ని మలుపుల్ని తిరగవల్సి వుంటుంది. ఏ మలుపులో జీవితం ఎల్లాంటి దారిని తొక్కుతుందో, ఎల్లాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వుంటుందో, ఏ పరిణామాల్ని పొందుతుందో ఊహించటం కష్టం. తన బ్రతుకు చెడ్డ మలుపుకే మొగ్గు చూపి నట్టుంది. ఈ మలుపు నుంచి తను తెలివిగా తప్పించుకొని బయట పడితే గానీ, ముందు జీవితం లేదు. వనజాక్షితో సంబంధం పూర్తిగా త్రెంచు కొంటేనే గానీ యీ బ్రతుకు మలుపు మంచిదారి పట్టదు. కాని ఈ కలుషిత వాతావరణపు మలుపునించి విముక్తి పొందట మెట్లా?

అతను మేడ మెట్లు ఎక్కేటప్పటికి ఎదురూగ్గా పచార్లు చేస్తో వనజాక్షి కనబడింది. 'ఇంత ఆలస్యంగా వచ్చారేం?' అన్నట్లు అదో రకమైన దిగులుగా చూసింది. అదేమీ గమనించకుండా వసంతరావు ప్రయత్న పూర్వకంగా తల దించుకొని, ద్వేషాన్ని ముఖంలో దట్టంగా ముద్రించుకొని, ఇంటి తాళం తీసి, గబ గబా ఇంటిలోకి నడిచాడు.

"ఏమండోయ్! ఏమిటి నాపై ఈ అర్థాంతరపు అర్థం లేని అలుక—" అంటూ వనజాక్షి ముఖ కవళికల్ని నిశ్శబ్దంగా కదిలిస్తూ అతని ఇంటిలోకి వచ్చింది.

తప్పనిసరై పెదాలపైకి చిరునవ్వును పొంగించాడు వసంతరావు. అతని నడుం చుట్టూ చేయి వేసి కుర్చీలో కూర్చుండబెట్టింది వనజాక్షి.

'ఛీ, ఛీ, ఈ విషపు వాతావరణం నుంచి తను బయట పడలేడు' అతని మనస్సు దీర్ఘంగా కన్నీళ్ళు కార్చింది.

రోజులు అట్లాగే దొర్లుతున్నాయి.

ఆ రోజు భార్య దగ్గరనుంచి వొచ్చిన లేఖ చదువుకున్నాక—

వనజాక్షి బంధం నుంచి బయట పడాలని గట్టిగా నిర్ణయించు కున్నాడు వసంతరావు.

ప్రియమైన శ్రీవారికి...

మీరు క్షేమమని భావిస్తాను. బాబూ, నేనూ కులాసా. మీ ఆరోగ్యాన్ని గురించే నేను ఆదుర్దా పడుతున్నాను. ఆ హోటలు తిండి మీకు సరీగా వంటబడుతున్నదో, లేదో! అన్నీ నూనె పదార్థాలు. ఏం తింటున్నారో ఏమో! సినిమాలకూ, క్లబ్బులకూ వెళుతూ ఆరోగ్యాన్ని గురించి జాగ్రత తీసుకుంటు న్నారో లేదో! మీరు వెంట వెంటనే ఉత్తరాలు వ్రాయడం లేదు. అంత తీరిక లేని వత్తిడి పను లేమున్నాయో నాకు అర్థం కావ డము లేదు. నా మనస్సు అనుక్షణమూ కీడును ఊహిస్తూ భయం భయంగా అల్లకల్లోల పూరితమై ఉంటూన్నది. ఇంటిలో ఇల్లాలు లేనప్పుడు యజమాని ఆత్మ నిగ్రహానికి ఒక విధమైన అగ్నిపరీక్ష ఏర్పడుతుంది. అందులో నెగ్గినప్పుడే జీవితపు విలువలు బలిష్ఠమౌతాయి. ఈ ప్రాథమిక సత్యం మీకు తెలియ నిది కాదు. మీ ఆత్మపై ప్రవర్తనపై నాకు గల ప్రగాఢ విశ్వాసమే నా బ్రతుక్కు ఆయువు పట్టుగా కాలాన్ని పొడి గిస్తూన్నది. తాత్కాలిక మైన అశాంతికి మనస్సు లొంగినా —నా ఆత్మ విశ్వాసం జంకదు. అది పర్వతం లాంటిది. అయినా ఇంకా ఎన్నాళ్లు? అయిదో నెల ప్రవేశించగానే మంచిరోజు చూసి మా నాన్నగారు తీసుకు వస్తారు. ఇంకా ఒక్క నెల రోజులు ఓపిక పట్టాలి...

—మీ చరణదాసి, వెంకటలక్ష్మి

ఆ లేఖ చదువుకున్న మీదట వసంతరావు తల్లక్రిందులై నాడు. ఆలోచనలు చక చకా ప్రయాణించినయ్. మృగతృష్ణ లాంటి

వనజాక్షి మోహపు మడుగు నుంచి బయట పడి దూర దూరంగా పారిపోవాలి, ఆమె తోడి తన సంబంధమూ, ప్రణయ కలాపాలూ—సూచన ప్రాయంగా తన భార్యకు తెలియ వచ్చినా తన విలువలు బూడిదలో పన్నీరే! వెంకటలక్ష్మి ఏ అఘాయిత్యానికి తలపడినా తలపడొచ్చు. తన పవిత్రతకు భర్త సత్ప్రవర్తన ద్వారా ఆధిక్యతను చేకూర్చుకోవాలనుకునే భార్య భర్త అవినీతి కార్యాలను విని తట్టుకోలేదు. తను వెంటనే ఇల్లు మార్చాలి. ఊళ్ళో ఎక్కడైనా ఇల్లు అద్దెకు తీసికోవాలి... అందువల్ల ప్రయోజన ముంటుందా? వనజాక్షి నీడ తన బ్రతుకు నుంచి శాశ్వతంగా తొలిగి పోతుందా? ప్చ్. లాభం లేదు. తను ఊళ్ళో ఉంటున్నట్టు తెలిస్తే—ఏ క్షణానమైనా తన ఇంటికి రావచ్చు. తన కర్మ తాలూకు వక్రగతి బయట పడొచ్చు. తను ఈ వూరి నుంచే వెళ్ళాలి. దూరంగా మరో టవునుకు ట్రాన్స్‌ఫర్ చేయించు కోవాలి. అదైనా సత్వరం-అంతకంటే గండం గడిచి గట్టెక్కే మార్గం లేదు.

పట్టుదలతో ప్రయత్నించి ఇద్దరు ముగ్గురు వ్యక్తులసహాయాన్ని ఆశ్రయించి - ఎల్లాగైతేనేం వసంతరావు మచిలీ పట్నానికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు ఆ విషయం ఆ సాయంత్రమే వనజాక్షితో చెప్పాడు.

నిమ్మకు నీరెత్తినట్టు నిర్లిప్తంగా చూసింది వనజాక్షి. 'నీ అవసరాలు తీరాయి. నువ్వెళ్ళిపోతున్నావు మనస్సులలో బలపడని ఆత్మీయత ఇనుప గొలుసులతో బంధిస్తే మటుకు బల పడుతుందా?' అన్న భావం ఆ చూపులలో ధ్వనించింది.

ఆ రాత్రంతా వసంతరావు నిశితంగా ఆలోచించాడు. తను ఇన్నాళ్ళూ వనజాక్షిని అనుభవించాడు. ఆమెను తను ప్రత్యే

కంగా పాడుజేసింది కాకపోయినా తన సుఖం కోసం ఉపయోగించుకున్నాడు. అవినీతి కావచ్చు. అక్రమం కావొచ్చు. పాపం కావచ్చు. తన అవసరాలకు ఆమెను సాధనంగా ఉపయోగించుకున్నాడు గానీ, తను ఆమెకు పారితోషికంగా పరిహారంగా ఏమీ ముట్టజెప్పలేదు. కనీసం పాతిక రూపాయలు పెట్టి ఒక్క చీరైనా కొనివ్వలేదు. వాస్తవానికి ఆమె తననుంచి ఏమి ఆశించి, తనతో సంబంధం ఏర్పర్చుకుందో తనకే తెలీదు. ఎప్పుడూ ఆలోచించలేదు. ఏదో జరిగి పోయింది. తన బ్రతుకు గాడి తప్పింది. ఇప్పుడు సరైన గాడిలోకి మళ్ళీ బ్రతుకును పడవేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. మలినమైన గతాన్ని పూర్తిగా మర్చిపోవడం తన విధి చేసిన పాపానికీ పాల్పడిన అవినీతికీ ప్రవర్తనలో మెతకదనానికీ పరిహారంగా ఆమెకు ఏదైనా వస్తువును సమర్పించి ఆ వ్యవహారం నుంచి చేతులు దులుపుకొని బయటపడటం మేలు. ఆ పరిహారంతో గానీ తనకు తృప్తి చిక్కదు. ఆ విధమైన ప్రాయశ్చిత్తంతోగానీ తన మనస్సుకు శాంతి లభించదు. లేకుంటే జీవితాంతమూ వనజాక్షితో జరిపిన ప్రణయ వ్యవహారాలు తుప్పు కత్తుల్లా కుళ్ళగించ బడుతూనే ఉంటాయి. కాబట్టి తను ఓ నెక్లెస్ కొని ఆమెకు పారితోషికంగా ఇవ్వడం మంచిది. ఆ రాత్రి ఆ అభిప్రాయాన్ని మనస్సులో గట్టిగా గౌరవించు కున్నాడు వసంతరావు.

మరునాడు సేవింగ్స్ బ్యాంక్ ఎకౌంటులో నాలుగు వందల రూపాయలు డ్రా చేసి, సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళేప్పుడు జ్యూయలరీషాపు కెళ్ళి--మామిడి పిందెల రాళ్ళ నెక్లెస్ కొన్నాడు వసంతరావు. మునిమాపు పడుతుండగా ఇంటికి వెళ్ళాడు.

ఆమె గదిలోంచి లేడీ డాక్టరు రావడం గమనించి ఆశ్చర్య చకితుడై నాడు వసంతరావు. వెంటనే ఆమె గదిలోకి వెళ్ళాడు. ఆమె మంచంమీద పడుకొని, గొంతువరకూ దుప్పటి కప్పుకున్నది. అస్వస్థతగా వున్నట్టుంది.

"ఏమిటి వనజాక్షి! అలా ఉన్నావు? జ్వరమా?" కృత్రిమమైన ఆదుర్దాని కనబరుస్తో అన్నాడు వసంతరావు.

అవునన్నట్టు ఆమె నెమ్మదిగా తల ఆడించింది

"ఎప్పట్నుంచీ. ఏం జ్వరం? మందు తీసుకుంటున్నావా? నాకు చెప్పనేలేదే!"

"ఆఁ...పెద్దగా ఆదుర్దా పడవలసిన జబ్బుకాదు. అప్పుడప్పుడూ వస్తూ ఉండేదే!" నిర్లక్ష్యంతో కూడుకున్న నిట్టూర్పుతో అన్నది వనజాక్షి.

"రేపే ఇల్లు ఖాళీ చేసి వెళుతున్నాను వనజాక్షి! మళ్ళీ మనం జీవితంలో కలుసుకుంటామో, లేదో! నేను నీకు అప్పుడప్పుడూ జ్ఞాపకం వచ్చేట్టు ఒక విలువైన వస్తువు బహూకరించాలనుకుంటున్నాను. ఇదిగో ఈ రాళ్ళ నెక్‌లెస్ తీసుకో" అంటూ జేబులోంచి చిన్న పెట్టె తీసి యిచ్చాడు. అతని ముఖంలో తెచ్చి పెట్టుకున్న సంతోషం వెలితి లేకుండా వెలుగుతోంది.

ఆ పెట్టెను ఆమె అందుకుంది. తెరిచింది. చిక్కని చిరునవ్వును పెదాలపై బరువుగా దొర్లించింది.

"ఇన్నాళ్ళూ మన సంబంధానికి వెలకట్టి ఈ పరిహారం చెల్లిస్తున్నారా?"

కలవర పడ్డాడు వసంతరావు. కడుపులో ఏదో తెమిలినట్లయింది. వెంటనే సమాధానం చెప్పలేక పోయాడు.

"ఉహూఁ...కాదు, నీకు పారితోషికంగా యిస్తున్నాను. మన ప్రణయానికి యీ నెక్‌లెస్ చిహ్నం"

సుఖదుఃఖాల కతీతమైన పొడి నవ్వును పొడిగించింది.

"రేపు వెళ్ళేటప్పుడు కనబడుతారుగా?"

"ఆఁ తప్పకుండా."

ఆ రాత్రి వసంతరావు నిశ్చింతగా నిద్ర బోయాడు.

మరునాడు ఉదయం పది గంటలకు సామానంతా సర్ది, రెండు రిక్షాలకు ఎక్కించి, వనజాక్షి దగ్గరకు వెళ్ళాడు వసంతరావు చెప్పి రావటానికి.

వనజాక్షి మంచం మీదే పడుకొని ఉంది.

"వెళ్ళొస్తాను వనజాక్షి" అన్నాడు వసంతరావు నిలబడే.

"మీరు నాకు పారితోషికంగా ఖరీదైన నెక్లెస్ ఇచ్చారు" నేను కూడా...పరిహారంగా, కాదు కాదు పారితోషికంగా మన ప్రణయానికి చిహ్నంగా ఒక వస్తువు ఇవ్వదలచాను. అదుగో ఆ పెట్టెలో ఉంది. తీసికోండి. ఆ పెట్టె తాళం వేసి వుంది. ఆ తాళం చెవికూడా పెట్టెపైనే వుంది. కాని ఒక్క షరతు. మీ అబ్బాయిమీద ఆన. ఆ పెట్టె ఇప్పుడు తెరిచి చూడవద్దు. బందరు వెళ్ళాక తెరిచి చూడండి" అన్నది వనజాక్షి టేబుల్ పైన పెట్టివున్న ఓ రేకు పెట్టెను చూపిస్తూ.

"సరే, అలాగే" అంటూ ఆ పెట్టెను తీసికొని, మేడమెట్లు దిగి, తన సామాన్లతో పాటు రిక్షాలో పెట్టాడు వసంతరావు.

మధ్యలో రైలులో రెండు మూడుసార్లు ఆ పెట్టె తెరిచి లోపల ఏముందో చూద్దామని అనుకున్నాడు. కాని ఆమె పెట్టిన ఆన గుర్తుకు తెచ్చుకొని ఆ ప్రయత్నం విరమించుకొని, ఆసక్తిని బిగబట్టు కొన్నాడు.

మచిలీపట్నం వెళ్లేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. ఓ స్నేహితుడు అతన్ని రిసీవ్ చేసికోవటానికి స్టేషనుకు వచ్చాడు. ఆ స్నేహితుడే రామానాయుడి పేటలో ఇల్లుకూడా మాట్లాడి రెడీగా ఉంచాడు. నేరుగా వసంతరావు సామాను తీసికొని ఆ ఇంటిలోనే ప్రవేశించాడు.

స్నేహితుడు నిద్రబోయాక అర్ధరాత్రి సమయాన వనజాక్షి ప్రణయానికి చిహ్నంగా యిచ్చిన పెట్టెను వసంతరావు తెరిచాడు.

ఆ పెట్టెలో నెలలు చాలక పుట్టి చనిపోయిన పసిగుడ్డు తెల్లని గుడ్డలో చుట్టబడి ఉంది.

(తెలుగు వెలుగు)

---